# వేతనాలు అందక పుష్కరాల పారిశుద్ధ్య సిబ్బంది ఆందోళన




పంచాయితి కార్యాలయంవద్ద పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

**రెంటచింతల, 19-9-16 :**

కృష్ణా పుష్కరాలను పురస్కరించుకొని సత్రశాల స్నానవాటికలో పారిశుద్ధ్య విధులు నిర్వహించటానికి గానూ ప్రభుత్వం కాంట్రాక్టర్ల ద్వారా సిబ్బందిని సమీకరించి, ఆ 13 రోజులూ వారి సేవలను వినియోగించుకుంది. పుష్కరాలు ముగిసిన పిదప ఆ కార్మికులకు ఒప్పందం చేసుకున్న విధంగా వేతనాలు చెల్లించకుండా పలువురు కాంట్రాక్టర్లు మొండిచేయి చూపటం, ఎగ్గొట్టడం, వేతనాలలో కోత విధించటం, వేతన దినాలలో కోత విధించటం వంటి చర్యలకు పాల్పడుతున్నా, వారిని అదుపుచేసి కార్మికులకు సక్రమంగా వేతనాలు అందేలా చర్యలు చేపట్టకుండా మంత్రులు, అధికారులు నిర్లక్ష్యం వహించారు.

గుంటూరుజిల్లా, సత్రశాల ఘాట్ వద్ద సేవలందించిన పాలువాయి, మల్లవరం, జెట్టిపాలెం, రెంటాల, రెంటచింతల గ్రామాలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు రోజుకు 160 మంది చొప్పున మూడు షిఫ్టులలో విధులు నిర్వర్తించారు. వారితో ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం రోజుకు 400 రూ॥ కాకుండా, 300 రూ॥ మాత్రమే చెల్లించటానికి, అది కూడా 12 రోజులకే లెక్కకట్టటాన్ని, పుష్కరాలు గడిచి నెలరోజులవుతున్నా వేతనాలు చెల్లించకపోవటాన్ని నిరసిస్తూ బాధిత పారిశుద్ధ్య కార్మికులు రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) మరియు చైతన్య పంచాయితీ స్వీపర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో రెంటచింతల పంచాయితీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అధికార్లకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టరుతో జరిగిన చర్చలలో 13 రోజులకు వేతనం ఇవ్వటానికి, రోజుకు 350 రూ॥ చొప్పున చెల్లించటానికి అంగీకారం కుదిరింది.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు, కార్మిక యూనియన్ నాయకుడు కా॥ మామిడి సామియేలు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

ooooo